## క్లుప్తంగా

### నిరుపేద మహిళకు అండగా..

దుకాణం సమకూర్చిన సానా సతీష్‌బాబు ఫౌండేషన్



బడ్డీ కొట్టును ప్రారంభిస్తున్న తలాటం హరీష్

బోట్‌క్లబ్: అగ్ని ప్రమాదంలో జీవనాధారమైన బడ్డీ కొట్టు కాలిపోవడంతో ఇబ్బందులు పడుతున్న బాధిత మహిళకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ అండగా నిలిచింది. స్థానిక టూ టౌన్ ఓవర్ బ్రిడ్జి కింద ఘాటీలమ్మ అమ్మవారి ఆలయం వద్ద బడ్డీ కొట్టు నిర్వహిస్తూ జీవనం సాగించే వరలక్ష్మి దుకాణం ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైంది. దీంతో జీవనోపాధి లేకపోవడంతో ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ఆమెకు ఐరన్‌తో చేయించిన బడ్డీ కొట్టు సమకూర్చడంతో పాటు, దానిలో అమ్ముకొనేందుకు సామాన్లు సైతం ఏర్పాటు చేశారు. దీనిని ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ, ఇబ్బందుల్లో ఉన్న పేదవారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. పేద ప్రజలకు సహాయం అందించేందుకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బవులూరి రామకృష్ణ, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### ఓటు నమోదు ఫారాల పంపిణీ



ఓటు నమోదు ఫారాలు అందజేస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టభద్రులకు ఓటు నమోదు కోసం ఫారాలను ఆదివారం రమణయ్యపేటలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ ఉద్యోగి ఇందుగుల ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ల ఎన్నికల ఓటర్ల నమోదు నవంబరు 6 వరకు జరుగుతుందన్నారు. పట్టభద్రులు తమ ఓటు నమోదుకు ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్, ఓటరు ఐడీ జిరాక్సులతో పాటు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, మొబైల్ నంబరు దరఖాస్తుకు జత చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### అధిక ఒత్తిడితో మధుమేహం



వైద్య శిబిరంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ ఎలైట్ సభ్యులు

కాకినాడ రూరల్: నిత్య జీవితంలో అధిక ఒత్తిడితో మధుమేహం వచ్చే అవకాశం ఉందని లయన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ అధ్యక్షుడు ఎంఎస్ఆర్‌వీ సత్యనారాయణ అన్నారు. బోట్‌క్లబ్ ఉద్యానవనంలో ఇనోదయ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం లయన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో ఉచిత రక్త, బీపీ పరీక్షలు వంటి సేవలను వాకర్లకు అందించారు. కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్ ఎం.విశ్వేశ్వరరావు, కోశాధికారి సత్యనారాయణ, కటకం శ్రీనివాస్, సత్తిరెడ్డి, శాస్త్రి, రవీంద్రనాథ్, కిశోర్, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.



అప్రోచ్ లేకపోవడంతో వర్షం కారణంగా అధ్వానంగా మారిన ఎల్‌బీనగర్ నుంచి ముత్తావారధి రహదారి



ఇటీవల కురిసిన వర్షానికి నీట మునిగిన మెయిన్ రోడ్డు. వర్షపు నీటిలో ద్విచక్ర వాహనాలు

# కాకినాడలో ఇంతే..!

- చినుకు పడితే చెరువులా మారుతున్న మెయిన్ రోడ్
- వర్షంతో పలు ప్రాంతాల్లో తప్పని అవస్థలు
- ముంపు నీరు పోయే దారిలేక ఇబ్బందులు
- శాశ్వత చర్యలు తీసుకోవాలంటున్న నగర ప్రజలు



శాంతినగర్ నుంచి సాంబమూర్తినగర్ ఆదిత్య కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి

బోట్‌క్లబ్: కార్పొరేషన్ స్థాయికి కాకినాడ నగరం ఎదిగిన అనంతరం స్మార్ట్ సిటీగా కూడా రూపాంతరం చెందింది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. చినుకుపడితే అనేక ప్రాంతాల్లో కొలనులు తయారయ్యే పరిస్థితి నెలకొని ఉంది. గంట పాటు ఆగకుండా వర్షం వస్తే నగరంలో పలు రహదారులు సెలయేరులను తలపిస్తున్నాయి. ప్రజలు ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. తుఫాన్ వస్తే నగర ప్రజలు ఇది ఎప్పుడు తగ్గుతుందని ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**బయటకు రాలేని దుస్థితి**

నగరంలో స్థానిక మెయిన్‌రోడ్డు, సినిమారోడ్డు, రెవెన్యూకాలనీ, ఎల్‌బీనగర్, సురేష్‌నగర్, టూటౌన్ నూకాలమ్మ గుడివీధితో పలు ప్రాంతాల్లో పూర్తిగా రహదారులు కనిపించని విధంగా మునిగిపోతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రయాణించే ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. పలు కాలనీల్లో అయితే ఇంటి నుంచి అడుగు కూడా బయట పెట్టడం కూడా కుదరని దుస్థితి. ఇంటి మెట్ల వరకూ వర్షపునీరు చేరిపోవడంతో అడుగు బయటకు వేయాలంటే ఏమవుతుందోనని భయపడాల్సిన పరిస్థితి ఉంది. చినుకుపడితే చాలు కాకినాడ మెయిన్ రోడ్‌లో ప్రతి జంక్షన్ చెరువును తలపించే రీతిలో జలపాతంగా తయారవుతోంది.

**రోడ్లు ఎత్తు చేసి..**

నగరపాలక సంస్థ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన చిరు వర్తకులు వారి షాపు ముందు ఎత్తైన ఐరన్ టేబుల్ ఏర్పాటు చేసుకుని వారి వ్యాపారాలు కాపాడుకుంటున్నారు. ప్రతీ జంక్షన్ లోనూ నీరు నిలిచిపోతున్న దుస్థితితో వాహనదారులు పాదచారులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. పెద్ద మసీదు వద్ద లోపలికి వచ్చిన నీటిని బయటకు ఎత్తిపారబోయాల్సి వస్తోంది. రోడ్లు ఎత్తు చేయడం వలన సూర్యకళా మందిరం, సూర్యారావు రావుపేట నూకాలమ్మ గుడి లోతట్టుగా మారడం వలన అక్కడి ప్రాంగణాలు నీటితో నిండిపోతున్నాయి. మెయిన్ రోడ్ అందంగా కనబడటం కోసం ఇంజినీరింగ్ పనులు చేశారు మినహా, కాలువ నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోలేదు. మెయిన్ రోడ్ పొడవునా ఇదే దుస్థితి ఉంది. నగర ప్రధాన రహదారే ఇలా ఉంటే, లోపల ప్రాంతాలు ఏ రకంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. డ్రైనేజీ నిర్వహణ నిర్మాణంపై యాక్షన్ ప్లాన్ ఉంటే మెయిన్ రోడ్‌కు ఇటువంటి దుస్థితి ఉండేది కాదని రోడ్డు పక్కన దుకాణాలు ఉన్న యజమానులు, వినియోగదారులు అంటున్నారు.

**పూడికలు తీయక..**

ఎండాకాలంలో డ్రైనేజీలో ఉన్న పూడికలు తీయకపోవడంతో, వాటిలో నీరు పారడం లేదు. దీంతో ప్రస్తుతం వర్షం వస్తే వర్షపు నీరు పోయేదారి లేకుండా పోయింది. వర్షం వస్తే మురుగునీరు, వర్షపు నీరు కలిసిపోవడం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో వర్షం వచ్చిన తర్వాత నీరు పోయిన మురుగు మాత్రం రోడ్లపై ఉండడంతో దుర్వాసన తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి డ్రైనేజీల్లో పేరుకొనిపోయిన పూడికలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

**పూర్తి స్థాయిలో నిర్మించక..**

ఇటీవల నూతనంగా నిర్మించిన ముత్తా వారధికి అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి స్థాయిలో నిర్మాణం చేయకపోవడం వల్ల ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇక్కడ చాలా అధ్వానంగా తయారైంది. స్థానిక ముత్తా వారధి నుంచి ఎల్‌బీనగర్‌ను కలిపే రహదారి నిర్మాణం చేయకపోవడం వల్ల గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. ఇక్కడ ద్విచక్ర వాహనాలు జారిపడి పలువురు గాయాల పాలవుతున్నారు.

**చాలా ఇబ్బందులు పడుతున్నాం**



నగరంలో వర్షం వస్తే పలు ప్రాంతాల్లో రోడ్డుపై ప్రయాణించే వీలు కూడా ఉండడం లేదు. టూటౌన్ నూకాలమ్మ గుడివీధి పూర్తిగా వర్షపునీరుతో నిండిపోవడంతో, వర్షం వస్తే ఇంటిలో నుంచి బయటకు అడుగుపెట్టే వీలు లేకుండా పోతుంది. అధికారులు వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలి.

– జి.భానోజీరావు, స్థానికుడు

**అప్రోచ్ రోడ్డు వెంటనే నిర్మించాలి**



ఈ రహదారి నిర్మాణం పూర్తి చేసి, సుమారు ఆరు నెలల క్రితం ప్రారంభించారు. కానీ ఇంకా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రతిరోజు స్కూల్, కళాశాల విద్యార్థులను తీసుకొని వెళుతుంటాను. వర్షం వస్తే ముత్తా వారధి వైపు వెళ్లాలంటే భయమేస్తోంది.

– జి.కృష్ణ, ఆటో డ్రైవర్

### ఎంఎస్ఎన్ విద్యార్థిని ప్రతిభ

బాలాజీచెరువు: వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఎంఎస్ఎన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థిని అంగాడి భువనేశ్వరి ద్వితీయ స్థానం సాధించింది. సహ జీవనం ద్వారా వన్యప్రాణుల సంరక్షణ అనే అంశంపై పోటీలు నిర్వహించగా, అందులో ప్రతిభ చూపి బహుమతి సాధించింది. కోరంగి మడ ఫారెస్ట్‌లో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం ఆమెకు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని భువనేశ్వరిని కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకుడు చిట్టూరి చిట్టిబాబు అభినందించారు.

### నేటి నుంచి తపాలా వారోత్సవాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): తపాలా వారోత్సవాలను సోమవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు ఆదివారం ఇక్కడ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఏడో తేదీన పార్సిల్ సేవల్లో వచ్చిన మార్పులు, 8న ఫిలాటలీ దినోత్సవం సందర్భంగా క్విజ్ పోటీలు, 9వ తేదీన అంతర్జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా మాతృమూర్తి పేరుతో మొక్కలు నాటడం, 10వ తేదీన రాజవొమ్మంగి, పిఠాపురం, మామిడాడలో ఆధార్ పోస్టల్ సేవలు, 11వ తేదీన తపాలా సేవలు, జీవితబీమా, పొదుపు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు.

### సినిమాలు

| | |
|---|---|
| ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: | దేవర పార్ట్–1, దక్షిణ,సత్య సుందరం |
| దేవీ మల్టీప్లెక్సు 4 స్క్రీన్స్: | దేవర పార్ట్–1, సత్య సుందరం, కాళీ |
| లక్ష్మి: | దేవర పార్ట్–1 |
| సత్యగౌరి: | దేవర పార్ట్–1 |
| తిరుమల: | దేవర పార్ట్–1 |
| సీఅండ్‌సీ1: | మత్తువదలరా |
| సీఅండ్‌సీ2: | శ్వాగ్ |
| శ్రీప్రియ: | రామ్ నగర్ బన్ని |
| పద్మప్రియ: | దేవర పార్ట్–1 |
| సూర్య (వాకలపూడి): | దేవర పార్ట్–1 |
| సూర్య2: | మిస్టర్ సెలబ్రిటీ |

## విలీన ప్రక్రియలో ప్రతిష్టంభన తొలగించాలి



తూరంగి పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న రమణరాజు

కాకినాడ సిటీ: గ్రామాల విలీన ప్రక్రియలో సాంకేతిక సమస్యలను, కోర్టు కేసులను తొలిగించి, కాకినాడలో విలీనం చేసే విషయమై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటూ తూరంగి పంచాయతీ అధికారి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని పౌర సంక్షేమ సంఘం కోరింది. ఆదివారం సాయంత్రం తూరంగి పంచాయతీ కార్యాలయంలో కార్య నిర్వహణాధికారి జోగా రమణమ్మను పౌర సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు కలిసి వినతిపత్రం అందజేశారు. 2010 నుంచి 2017 వరకు కోర్టు కేసులు 2024 వరకు దస్త్రాలను వెనక్కి తీసుకువచ్చిన కారణంతో విలీన ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. విలీన జాప్యం వల్ల గతంలో ఏడేళ్లు, ప్రస్తుతం రెండేళ్లుగా ఎన్నికలు లేని దురవస్థ కాకినాడకు ఏర్పడిందన్నారు. గ్రామాలకు 13 ఏళ్లుగా ఎన్నికలు లేక ప్రభుత్వ నిధులు రాక, పౌర సౌకర్యాలు లభించడం లేదన్నారు. స్థానిక పాలన లేకుండా ప్రత్యేక అధికారుల పాలనతో కాకినాడ నగరం తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట ఎన్నికలు లేకుండా, అభివృద్ధి నిధులు రాకుండా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని వివరించారు. కాకినాడ కార్పొరేషన్‌కు గత రెండేళ్లలో ఆర్థి సంఘం నిధులు రూ.20 కోట్లు రాలేదన్నారు. విలీన గ్రామాలకు ఎన్నికల లేకపోవడంతో రూ.140 కోట్ల అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ప్రభుత్వానికి నివేదిక పంపి విలీనంలో నెలకొన్న ప్రతిష్టంభన వెతలు తొలగించాలని రమణరాజు వినతిపత్రంలో కోరారు.

## అలరించిన ప్రజానాట్య మండలి ప్రదర్శన



బహుమతులు అందుకున్న కళాకారుల బృందం



ప్రజానాట్య మండలి ప్రదర్శనలో నృత్య నాటిక

కాకినాడ సిటీ: నగరంలోని బాలాత్రిపుర సుందరి ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆద్యంతం అలరించాయి. ప్రజానాట్య మండలి కాకినాడ కార్యదర్శి లోవరాజు నేతృత్యంలో మట్ల తిరుపతి రాసిన కమ్మనైన అమ్మపాట, కె.దేవేంద్ర రచించిన ఎక్కడమ్మా నువ్వులేనిది, ఆర్‌పి వాసు రచించిన నా చెమట చుక్క అంటూ సాగిన పాటలకు నృత్య రూపకాలు ప్రదర్శించారు. డప్పు కళాకారుడు అర్జున్ తన వాయిద్యంతో సభికులను ఉర్రూతలూగించారు. గాయత్రి, వైష్ణవి అనే విద్యార్థినులు నవరాత్రుల విశిష్ట గీతానికి నృత్య ప్రదర్శన చేశారు. నాదసుధ మండా విజయ కుమారి శిష్యులు సుజాత, శ్రీలక్ష్మి కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ, దసరా ఉత్సవాల్లో ప్రజానాట్య మండలి కళా ప్రదర్శనలకు అవకాశం కల్పించిన ఆలయ కమిటీ అధ్యక్షులు గ్రంధిబాబ్జీ, కమిటీ సభ్యులకు, అధికారులు, కాశీప్రియ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా కళలను ప్రోత్సహించి ఆదరించాలన్నారు. అనంతరం లోవరాజు, అర్జున్‌కు ఎగ్జిక్యూటివ్ అధికారి వీర్రాజుచౌదరి సత్కరించారు.

## జగన్మాతా పాహిమాం..



వీణాపాణి అలంకరణలో సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి అమ్మవారు



రాజరాజేశ్వరీదేవి అలంకరణలో దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు



అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో..



భానులింగేశ్వరస్వామి ఆలయంలో లలితాదేవి అలంకరణలో..

- ఆలయాల్లో భక్తుల సందడి
- వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చిన అమ్మవారు



అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బాలపూజ

బోట్‌క్లబ్: దసరా వేడుకల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు వీణాపాణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మంజీన నాట్యాలయం విద్యార్థులు ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్య ప్రదర్శన, నాట్యారాధన మ్యూజిక్, డాన్స్ అకాడమీ విద్యార్థుల నాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలోని ఉషా రాజరాజేశ్వరి అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్ప స్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా బాలాపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక అశోక్ నగర్ సాయిబాబా ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని తెల్ల చామంతి పువ్వులతో పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్చుతరామారావు దంపతులు పూజలు నిర్వహించారు. స్థానిక సంతచెరువు కనకదుర్గ అమ్మవారి ఆలయంలోను, స్థానిక శారదాదేవి ఆలయంతో పాటు, పలు అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు.



కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని శ్రీపీఠంలో వారాహి మాతగా ఐశ్వర్యాంబిక అమ్మవారు

**వారాహి మాతా నమోస్తుతే..**

కాకినాడ రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు ఆదివారం సాయంత్రం కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఐశ్వర్యాంభిక అమ్మవారు వారాహి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాశక్తివంతమైన అమ్మవారిగా కొలిచే వారాహి మాతను చూసి భక్తులు తరించారు.

## విద్యార్థులతో చెలగాటం

- విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- సీబీఎస్ఈ రద్దు చేసి, ఎస్ఎస్‌సీ పద్ధతిలో పది పరీక్షలు
- ఆందోళనలో విద్యార్థులు

కాకినాడ సిటీ: వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవితవ్యంపై ఇష్టారాజ్యంగా వ్యవహరించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పథకాలను రద్దు చేయడం లేదా పేర్లు మార్చడం మినహా చేసిందేమీ లేదంటున్నారు. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందంటూ విద్యార్థి, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసిన సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) విధానాన్ని రద్దు చేసింది టీడీపీ కూటమి సర్కార్. ఈ ఏడాది నుంచి పాత పద్ధతిలోనే (సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్) పది పరీక్షలు నిర్వహించాలనే సంస్కరణను తీసుకొచ్చింది. దీంతో అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు నెలల్లో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మళ్లీ మొదటికి రానుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. సాధారణంగా సీబీఎస్ఈ సిలబస్‌ను అభ్యసించిన విద్యార్థులు పది, ఇంటర్ అనంతరం జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను చాటి, కేంద్ర ప్రభుత్వ కొలువుల్లో సత్తాచాటే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మూడేళ్ల పాటు కష్టనష్టాలకు ఓర్చుకొని, సీబీఎస్ఈ సిలబస్‌కు అలవాటు పడిన విద్యార్థులు.. తాజా ప్రభుత్వ నిర్ణయంతో ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై విద్యార్థి, ప్రజా సంఘాలతో పాటు, తల్లిదండ్రులు సైతం మండిపడుతున్నారు.


**అయోమయంలో విద్యార్థులు**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022–23 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేసింది. ఈ మేరకు కాకినాడ జిల్లాలో ఏపీఎస్‌పీ, సర్పవరం, తూరంగి, కస్తూర్బా విద్యాలయం పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. 8వ తరగతి నుంచి ప్రారంభించి క్రమంగా 10వ తరగతి వరకు కొనసాగించారు. అధికారులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు రాయాల్సి ఉంది. ఈ మేరకు విద్యార్థులు సైతం ఆ దిశగా సన్నద్ధమయ్యారు. అయితే కూటమి ప్రభుత్వం మళ్లీ పాత పద్ధతిలోనే పది పరీక్షలు రాయించాలని నిర్ణయం తీసుకోవడంతో అయోమయంలో పడ్డారు పది విద్యార్థులు.

**ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ**

సీబీఎస్ఈ విద్యను ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు సైతం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చింది. ఈ మేరకు మెళకువలపై అవగాహన పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే బోధన సాగించారు. ఎన్నో ఇబ్బందులు ఓర్చి తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులు అందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులు సైతం ఉత్సాహంగా ఉన్నారు. అంతా బాగుంది అనుకుంటుండగా, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం అన్ని వర్గాలను విస్మయానికి గురి చేసింది. గత ప్రభుత్వ నిర్ణయాలను తోసిపుచ్చడమే తమ లక్ష్యం అన్నట్లుగా కూటమి ప్రభుత్వ తీరు ఉందని విద్యార్థి, ప్రజా సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


**నైపుణ్యాన్ని దెబ్బతీసినట్టే..**



సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేయడమంటే విద్యార్థుల నైపుణ్యాన్ని దెబ్బతీసినట్టే అవుతుంది. ఈ విధానం వలన విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా, ఆసక్తికి అనుగుణంగా చదువులు కొనసాగిస్తారు. నైపుణ్యాలను మెరుగుపర్చుకుని ఏ రాష్ట్రానికైనా వెళ్లి చదువుకోవచ్చనే ఆత్మస్థైర్యాన్ని పొందారు. సమస్యలను తమంతట తామే పరిష్కరించుకునే సామర్థ్యాలను పెంపొందించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఏ మాత్రం సమంజసం కాదు.

– చెక్కల రాజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ

**కాలానికి అనుగుణంగా..**



పెరుగుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యను అందించాల్సిన అవసరం ఉంది. సీబీఎస్ఈ విధానం పేద, మధ్యతరగతి పిల్లలకు ఎంతో ఉపయోగకరం. సాంకేతిక విద్యపై పట్టు సాధిస్తారు. పోటీ పరీక్షల్లో నెగ్గేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రత్యేకించి గ్రామీణ విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ నిర్ణయం సరికాదు. 6 నుంచి 10వ తరగతి వరకు సీబీఎస్ఈ విద్యను అందిస్తే బాగుంటుంది.

– వీజే వినుు, సైకాలజిస్ట్, కాకినాడ